ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
సోమవారం 21 అక్టోబరు 2024



నేటి నుంచి పోలీసు అమరవీరుల స్మారకోత్సవాలు

● ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడపక్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏటా నిర్వహించే స్మారకోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలను, త్యాగాలను కొనియాడుతూ ఈ స్మారకోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసుశాఖ సిద్ధమైనట్లు తెలిపారు. ఈ నెల 21వ తేది నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమాల వివరాలు

21న ఉదయం 7.30కు కడప నగరంలోని పోలీసుపరేడ్ గ్రౌండులో ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బందికి నివాళులర్పించి స్మృతిపరేడ్ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు సెషన్స్ జడ్జి ఇంతియాజ్ అహ్మద్, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టరు అదితిసింగ్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

21 నుంచి 31 వరకు జిల్లా అంతటా పోలీసుస్టేషన్ల పరిధిలోని ముఖ్యమైన కూడళ్లల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో అమరవీరులను స్మరిస్తూ హోర్డింగులు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నారు. 24 నుంచి 27 వరకు సినిమాహాళ్లు, లోకల్ టీవీ ఛానళ్లు, దినపత్రిల్లో పోలీసు అమరువీరులకు సంబంధించిన విషయాలను ప్రచారం చేయనున్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు స్కూల్స్, కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాల కట్టడిలో యువత పాత్ర, పోలీసు సిబ్బంది, వారి పిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లు, అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించనున్నారు. 25 నుంచి 26 వరకు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్‌హౌస్ నిర్వహిస్తారు. పోలీసుశాఖలో ఉపయోగించే ఆయుధాలు, పరికరాలు, బాంబు డిస్పోజల్ ఆర్టికల్స్ తదితర అంశాలపై విద్యార్థులకు పరిచయం చేయనున్నారు. 28న ఉదయం 11 గంటలకు జిల్లా పోలీసు సిబ్బంది ప్రజల భాగస్వామ్యంతో కడప నగరంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఉచిత వైద్యం, రక్తదాన శిబిరం నిర్వహిస్తారు. 31న రాష్ట్రీయ ఏక్తాదివస్ సందర్భంగా ఉదయం సమైక్యతా పరుగు, సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తారు.

రేపు వినికిడి సమస్యలపై ప్రత్యేక మెడికల్ క్యాంపు

● జిల్లా ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో

కడప(కలెక్టరేట్), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వినికిడి సమస్యలు ఉన్న వారికి ఈ నెల 22న ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఉమామహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినికిడి లేని భారతదేశం కొరకు, వినికిడి సమస్యలు లేని ఆంధ్రప్రదేశ్ కొరకు దీన్‌దయాల్ శ్రవణా ఫౌండేషన్, ఎన్‌హెచ్‌ఎం, ఎన్‌పీపీసీడీ, ఆర్‌బీఎస్‌కే సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 0-19 ఏళ్ల వయస్సుండి వినికిడి సమస్యలతో బాధపడుతున్న వారు ఆధార్, రేషన్‌కార్డు, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఈఎన్‌టీ డాక్టర్ ప్రిస్కిప్షన్‌తో హాజరు కావాలన్నారు. పీహెచ్‌సీలు, పట్టణ కేంద్రాల ఆసుపత్రుల పరిధిలో వినికిడి సమస్యతో బాధపడే వారిని గుర్తించి పంపాలని వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా సిబ్బందిని ఆదేశించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

సలాం పోలీస్

● నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

● నేటి నుంచి 31 వరకూ జిల్లాలో పోలీసు వారోత్సవాలు

● నేడు కలికిరి సీఆర్పీఎఫ్‌లో సద్భావనా దివస్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు



కలికిరి సీఆర్పీఎఫ్ సింహద్వారం

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

అది 1959 అక్టోబరు 21వ తేదీ. భారత్ చైనా సరిహద్దులోని అత్యంత ప్రమాదకరమైన లద్దాక్ దగ్గర 'హాట్ స్ప్రింగ్స్' ప్రాంతం. సరిహద్దులో గస్తీ కాస్తున్న క్రౌన్ రెప్రజెంటెటివ్స్ పోలీస్ (సీఆర్పీ) దళంలోని సైనిక జవాన్లకు ఎస్ఐ సర్దార్ కరమ్ సింగ్ నాయకత్వం వహిస్తున్నాడు. అప్పటికే చైనా దళాల నుంచి ప్రమాదం పొంచి ఉందనే సమాచారంతో కరమ్‌సింగ్‌తో సహా జవాన్లంతా అప్రమత్తంగా ఉన్నారు. అనుమానిస్తున్నట్టే అత్యంత ఆధునిక ఆయుధాలతో చైనా దళాలు విరుచుకుపడ్డాయి. భారత సీఆర్పీ బృందంలోని 10 మంది జవాన్లు ఆత్మస్థైర్యంతో చైనా సైనికులను ఎదురిస్తూ చివరి రక్తం బొట్టు వరకు పోరాడి దేశం కోసం అసువులు బాశారు. ఈ నేపథ్యంలోనే ఇండియన్ మిలటరీకి పటిష్టం కావడంతో పాటు బీఎస్ఎఫ్ (సరిహద్దు భద్రతా దళం), ఐటీబీపీ (ఇండో టిబెట్ బార్డర్ పోలీస్) ఇలా విస్తరించింది. ఇక దేశంలో కూడా అంతరంగిక భద్రతకు ఉగ్రవాదం, వేర్పాటువాదం, నక్సలిజం వంటి అనేక సవాళ్ల మొదలవడంతో ఆ దిశగా దేశ అంతరంగిక భద్రతా బలగాలను పటిష్టం చేసేందుకు సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ వంటి పారా మిలిటరీ ఫోర్స్‌ను మిలటరీ రక్షణ దళాలకు సమాంతరంగా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా అమరవీరులను గుర్తుంచుకుని స్మరించుకునేందుకు ఒక ప్రత్యేక తేదీని నిర్ణయించాలని 1962లో దేశంలోని అన్ని రాష్ట్రాల హోంమంత్రులు, డీజీపీలు, ఐజీలు సమావేశమై ప్రతి సంవత్సరం అక్టోబరు 21వ తేదీ పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పాటించాలని నిర్ణయించారు. అప్పటి నుంచి సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ వంటి పారా మిలిటరీలతో పాటు ఆయా రాష్ట్రాల పోలీసులు కూడా సంస్మరణ దినంగా పాటించడం మొదలైంది. అందుకే దీనికి పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా నామకరణం చేశారు. కలికిరిలో ఉన్న సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ బెటాలియన్లతో పాటు జిల్లా పోలీసులు ఈనెల 31వ తేదీ వరకూ నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం.

వివరాలు 6 లో..



అమరవీరులకు ఎంత చేసినా తక్కువే..



దేశంలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాపాడటం ఇప్పుడు పెను సవాలుగా మారింది. వేర్పాటు, ఉగ్రవాదాలు, నక్సలిజం, మతోన్మాదం వంటివన్నీ జడలు విప్పి భారత సౌభ్రాతృత్వం మీద ముప్పేట దాడులు జరుపుతున్నాయి. అయినా ఎన్నో వ్యక్తిగత కష్టనష్టాలకోర్చి ఈ ఉన్మాదాల నిర్మూలనను సీఆర్పీఎఫ్ భుజాలకెత్తుకుంది. అకుంఠిత దీక్షా దక్షతలతో పోరాడుతూ ప్రజలను కంటికి రెప్పలా కాపాడటమే లక్ష్యం. లక్ష్య సాధన కోసం ఎంత వరకైనా ముందుకెళతాం. పోరాటంలో జవాన్లు అలసిపోకుండా ఉండటానికి ప్రజల నైతిక మద్దతు చాలు. అమరులైన వారి కోసం ఒక కన్నీటి చుక్క రాల్చితే అదే పది వేలు. మరింత స్ఫూర్తిదాయకంగా ముందుకెళతాము. ప్రజల భద్రత, ప్రజావిధేయతే మా లక్ష్యం, ధ్యేయం. అమరవీరుల కుటుంబాలే మాకు సదా వెన్నంటి నిలిచే సంకల్ప బలం. ఈ సందర్భంగా వికసిత్ భారత్ కోసం అందరం చేతులు కలిపి మరింత స్ఫూర్తి నింపుదాం.

\- అనుపమ్ శర్మ, డీఐజీ, సీఐఏటీ-3, సీఆర్పీఎఫ్, కలికిరి

16 గంటలు నరకం..

● మృత్యుఒడిలోకి బాలిక

● దిగ్భ్రాంతికి గురైన తల్లిదండ్రులు, బంధువులు

● అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

బద్వేలుటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గోపవరం సెంచురీ ప్లైవుడ్ వద్ద శనివారం జరిగిన అమానవీయ ఘటనలో మైనర్ బాలిక 16 గంటలు నరకం అనుభవించి మృత్యుఒడికి చేరింది. దీంతో తల్లిదండ్రులు, బంధువులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆదివారం సాయంత్రం కడప రిమ్స్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వాహనంలో బద్వేలు పట్టణంలోని స్వగృహానికి మృతదేహం చేరడంతో రోదనలు మిన్నంటాయి. కడసారి చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు, బంధువులు అధికసంఖ్యలో తరలివచ్చి బాలికకు జరిగిన అన్యాయాన్ని తలుచుకుంటూ కన్నీరు మున్నీరయ్యారు. కాగా సాయంత్రం అశ్రునయనాల మధ్య బాలిక అంత్యక్రియలు జరిగాయి.

బద్వేలు పట్టణంలో నివాసం ఉంటున్న దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రులు కూలిపనులు చేసుకుంటూ బిడ్డలను అల్లారు ముద్దుగా పెంచారు. మంచి చదువులు చదివించి, ప్రయోజకులను చేయాలనుకున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాగా తన కుమార్తెను బెదిరించి, అడవిలోకి తీసుకువెళ్లి నిప్పంటించి హత్యచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ తీరు చూసిన పలువురిని కంటతడి పెట్టించాయి. కాగా మైనర్ బాలిక సంఘటన విషాదకరమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. సమాజంలోని మానవమృగాలను కూకటివేళ్లతో పెకిలించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పెళ్లి చేసుకోమన్నందుకే హత్య

● 24 గంటల్లో నిందితున్ని పట్టుకున్నాం

● కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోవాలని కోరడంతో పథకం ప్రకారమే నిందితుడు విఘ్నేశ్ మైనర్ బాలికను పిలిపించి ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించి దారుణంగా హత్య చేశాడని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం సాయంత్రం ఆయన మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

బద్వేలు పట్టణంలో విఘ్నేశ్ ఉండేవాడు. వారి ఇంటి సమీపంలో మైనరు బాలిక కుటుంబసభ్యులు కూడా ఉండేవారు. విఘ్నేశ్‌కు ఐదేళ్లుగా బాలిక పరిచయం ఉండేది. కాగా విఘ్నేశ్ ఆరు నెలల క్రితం మరో యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. శుక్రవారం రాత్రి మైనరు బాలికకు ఫోను చేసి 'నిన్ను కలవాలని, నువ్వు రాకపోతే నేను సూసైడ్ చేసుకుంటా'నంటూ ఫోనులో చెప్పడంతో ఆ బాలిక శనివారం బద్వేలు టౌనుకు వచ్చింది. ముందే పథకం పన్నిన విఘ్నేశ్ ఒక బాటిల్‌లో అరలీటరు పెట్రోలు పట్టుకుని తన బండి బ్యాగులో పెట్టుకుని బద్వేలుకు వచ్చాడు. బాలికను పీపీకుంట అడవి సమీప ప్రాంతంలో రహస్యంగా కలుసుకోవాలని చెప్పడంతో ఇరువురు సెంచురీ ఫ్యాక్టరీ సమీపానికి వెళ్లారు. అక్కడి నుంచి సమీపంలోని అడవుల్లోకి ఆ బాలికను తీసుకెళ్లాడు. తరువాత బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపారు. తనను కూడా పెళ్లిచేసుకోవాలంటూ బాలిక విఘ్నేశ్‌ను కోరడంతో ముందుగానే పథకం ప్రకారం యువకుడు ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న బద్వేలు పోలీసులు అక్కడికి చేరుకొని 80 శాతం తీవ్రంగా గాయపడిన బాలికను చికిత్స నిమిత్తం బద్వేలు ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అయితే అర్ధరాత్రి 2.30 గంటలకు చికిత్స పొందుతూ బాలిక మృతి చెందినట్లు తెలిపారు. మూడు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారని ఆదివారం మధ్యాహ్నం కడప డీటీసీ వద్ద నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటన జరగడం బాధాకరమని ఎస్పీ తెలిపారు. నిందితుడిని 24 గంటల్లోనే అరెస్టు చేయడంలో తమ సిబ్బంది బాగా పనిచేశారని, ఫోరెన్సిక్, క్లూస్‌టీం పూర్తి స్థాయిలో పరిశీలించారన్నారు. నిందితుడు ఉపయోగించిన బాటిల్, లైటరు స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా ఆదివారం ఉదయం బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. బాలిక బంధువులు పెద్దఎత్తున మార్చురీ వద్దకు చేరుకున్నారు. తమ కుమార్తెను దారుణంగా హత్య చేసిన నిందితుడిని ఉరి శిక్ష వేయాలంటూ బోరున విలపించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ దూదేకుల సంఘం నాయకులు రిమ్స్ వద్ద డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం, ఎస్ఐలు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

గ్రంథాలయ నిర్మాణంతో బ్రౌన్ అజరామరం

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ క్రిష్ణమోహన్ ● ఘనంగా జానమద్ది శత జయంతి వేడుకలు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సీపీబ్రౌన్‌కు స్మారక చిహ్నంగా గ్రంథాలయం నిర్మించి బ్రౌన్‌ను అజరామరం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పుడి క్రిష్ణమోహన్ అన్నారు. ఆదివారం సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శాసన సభ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయమూర్తి క్రిష్ణమోహన్ హాజరై ముందుగా జానమద్ది చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాను ఈ కార్యక్రమానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గొప్ప గొప్ప వ్యక్తులకు రాయలసీమ జన్మనిచ్చిందని, అలాంటి వారిలో హనుమచ్ఛాస్త్రి ఒకరని కొనియాడారు. సభాధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ 2003లో తనకు జానమద్దితో పరిచయం ఏర్పడిందని, అది అనుబంధంగా మారిందన్నారు. సాహితీవేత్తగా కడప జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా జానమద్ది అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తులసినాథం నాయుడు, పురస్కార గ్రహీతలు పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, శతావధాన సామ్రాట్ గండ్లూరు దత్తాత్రేయ శర్మ మాట్లాడారు. కార్యక్రమాన్ని జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ సమన్వయం చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ క్రిష్ణమోహన్, మండలి బుద్ధప్రసాద్

సాహితీసేవ పురస్కారాలు

జానమద్ది సాహితీపీఠం ఆధ్వర్యంలో డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, గుండ్లూరు దత్తాత్రేయశర్మ, సీపీబ్రౌన్ భాషాపరిశోధన కేంద్రం సంచాలకులు ప్రొఫెసరు పార్వతి, అలపర్తి పిచ్చయ్యచౌదరి, డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, ఇందిరా ప్రియదర్శిని, యలమర్తి మధుసూదనలకు సాహితీపురస్కారాలు అందించారు. కార్యక్రమంలో జానమద్ది కుటుంబ సభ్యులు, ఎల్.గోవిందరెడ్డి, జింకా సుబ్రమణ్యం, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి, కొండూరు జనార్ధనరాజు, భూపతిరాయల్, శ్యాంసుందర్‌రెడ్డి, రాజారెడ్డి, కరీముల్లా, కొత్తపల్లె రామాంజనేయులు, డాక్టర్ తవ్వా వెంకటయ్య, వై.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చీనీ అ'ధర'హో

● టన్ను కాయలు రూ.60 నుంచి రూ.70 వేలు

● 15 రోజులుగా పులివెందుల మార్కెట్‌కు రాని చీనీకాయలు

● దీపావళికి మరింత పెరిగే ఛాన్స్



కాయలతో ఉన్న చీనీచెట్టు

పులివెందుల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చీనీ ధరలు రోజురోజుకు రైతుమోములో ఆనందాన్ని నింపుతున్నాయి. పదిహేను రోజుల క్రితం వరకు రూ.30 వేలు పలికిన టన్ను చీనీ ఇప్పుడు ఏకంగా రూ.60 వేల నుంచి రూ.70 వేలకు పెరిగింది. ధరలు అంతకు అంత పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పులివెందుల నియోజకవర్గంలో చీనీ పంట విరివిగా సాగులో ఉంది. దాదాపు 25 నుంచి 30 వేల ఎకరాల్లో దిగుబడులు ఇస్తున్న చీనీతోటలు సాగులో ఉన్నాయి. చీనీ అంటు నాటినప్పటి నుంచి ఐదేళ్ల వరకు దిగుబడి రాదు. అంటే ఐదేళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్న తోటలు మాత్రమే ప్రస్తుతం దిగుబడులు ఇస్తున్నాయి. ప్రస్తుతం చీనీ ధర రైతుమోములో ఆనందాన్ని నింపుతోంది. గత పదిహేను రోజులుగా చీనీ ధర రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. మొన్నటి వరకు రూ.30వేల నుంచి రూ.35వేలు మాత్రమే ఉండేది. వ్యాపారులే నేరుగా తోటల వద్దకు వచ్చి ఈ ధరకు కొనుగోలు చేస్తున్నారు. చీనీకాయల నాణ్యతను బట్టి రూ.60వేలు, రూ.62వేలు, రూ.65 వేలు, రూ.70వేలు ఇలా ధర వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. బయట ప్రాంతాల్లో ధర రోజురోజుకు పెరుగుతుండడంతో వ్యాపారులు కూడా తోటల వైపు పరుగులు తీస్తున్నారు. దీంతో రైతులు కూడా ధర పెరిగే సమయంలో తొందరపడి అమ్మకూడదని కాస్త ఎదురుచూశారు. గత నాలుగురోజుల క్రితం రూ.55 వేలు పలికితే శనివారం, ఆదివారం రూ.60 నుంచి రూ.70వేలు పలికింది. దీపావళి నాటికి రూ.80 నుంచి రూ.లక్ష వరకు పలుకుతుందని వ్యాపారులు, రైతుల అంచనా. గత ఒకటి రెండు సంవత్సరాల క్రితం దసరా నాటికి రూ.40 నుంచి రూ.50వేలు ధర పలికేది. ఈ ధర కోసం ఎక్కువ మంది రైతులు కూడా చీనీ కాయలను అమ్మకుండా ఎదురు చూసేవారు. ఏదేమైనా చీనీ ధరలు పెరగడం రైతుల్లో ఆనందాన్ని నింపింది.

కాగా ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో చీనీతోటలు సాగులో ఉన్న రైతులకు ధరలు పెరగడం శుభవార్తే అని, సింహాద్రిపురం, లింగాల, తొండూరు తదితర మండలాల్లోని రైతులకు దిగుబడి బాగా వచ్చినట్లు తెలిపారు.

రైతు కష్టానికి ప్రతిఫలం



ప్రస్తుతం ఉన్న చీనీ ధరలు రైతుల కష్టానికి ప్రతిఫలం. గత రెండు మూడు సంవత్సరాలుగా ఈ స్థాయి ధరలు లేక రైతులు నష్టాలబారిన పడ్డారు. నేను కూడా ఆరు ఎకరాల చీనీసాగు చేశాను. ప్రస్తుతం ఈ ధర రావడంతో ఆనందంగా ఉంది.

\- శివశంకర్‌రెడ్డి, చీనీ రైతు, అగ్రహారం, సింహాద్రిపురం

ములకలచెరువు విద్యార్థికి అరుదైన అవకాశం

● అంతర్జాతీయ స్థాయి నెట్‌వర్కింగ్‌పై దుబాయ్‌లో ప్రజెంటేషన్

● హాజరైన పలు దేశాల ప్రతినిధులు

● ఐఈఈఈ సొసైటీ నుంచి ప్రశంసలు



సెమినార్‌లో నెట్ వర్కింగ్‌పై వివరిస్తున్న మోక్షిత్

ములకలచెరువు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం అంగళ్లలోని మిట్స్ కళాశాలలో చదువుతున్న ములకలచెరువు విద్యార్థికి అరుదైన అవకాశం దక్కింది. దుబాయ్‌లో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన సమ్మిట్‌లో నెట్‌వర్కింగ్‌పై ప్రజెంటేషన్ ఇచ్చాడు. ఐఈఈఈ కమ్యూనికేషన్ స్టూడెంట్ టెక్ లీడర్ షిప్ కాన్ఫరెన్స్ ప్రతినిధుల నుంచి ప్రశంసాపత్రం, సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. ఈ సమ్మిట్‌కు పలు దేశాల ప్రతినిధులు, విద్యార్థులు హాజరయ్యారు. ములకలచెరువు వినాయకనగర్‌కు చెందిన బత్తుల శ్రీనివాసులు కుమారుడు బత్తుల మోక్షిత్ అంగళ్లలోని మిట్స్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 16వ తేదీ ఐఈఈఈ కమ్యూనికేషన్ స్టూడెంట్ టెక్ లీడర్ షిప్ కాన్ఫరెన్స్ అధ్వర్యంలో దుబాయ్ ర్యాపిల్ హోటల్‌లో జరిగిన సమ్మిట్‌లో నెట్‌వర్కింగ్, 2జీ, 4జీ, 5జీ, 6జీ వల్ల ప్రయోజనాల గురించి వివరించారు. ఈ సమ్మిట్ ప్రజెంటేషన్‌కు మన దేశం నుంచి మొత్తం 20 మంది హాజరు కాగా ఇందులో ములకలచెరువు విద్యార్థికి అవకాశం దక్కింది. సమ్మిట్‌కు గ్రీస్, బెహరైన్, పాకిస్థాన్ తదితర దేశాలకు చెందిన విద్యార్థులు, ప్రతినిధులు హాజరయ్యారు. అక్కడ బత్తుల మోక్షిత్ ఇచ్చిన ప్రజెంటేషన్‌కు కాన్ఫరెన్స్ ప్రతినిధుల నుంచి ప్రశంసలు అందుకున్నాడు. అలాగే ప్రతినిధులు సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈ క్రమంలో ఆదివారం దుబాయ్ నుంచి విద్యార్థి తిరిగి వచ్చాడు. ఈ సందర్భంగా మోక్షిత్ మాట్లాడుతూ తనకు దుబాయ్‌లో నెట్‌వర్కింగ్‌పై ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్, హెచ్‌వోడీ డాక్టర్ రాజశేఖరన్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

బాలిక మృతిపై సీఎం చంద్రబాబు విచారం

● ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గోపవరంలో మైనర్ బాలికపై పెట్రోలు పోసి నిప్పంటించిన సంఘటనలో విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడంతో సీఎం చంద్రబాబునాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థిని ఒక దుర్మార్గుడి దుశ్చర్యకు బలి కావడంపై తీవ్ర ఆవేదన చెందారు. ఘటనపై పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు ఆరాతీశారు. వేగంగా విచారణ పూర్తి చేసి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని ఎస్పీని ఆదేశించారు. ప్రత్యేక కోర్టులో ఫాస్ట్ ట్రాక్ విధానంలో ఈ కేసు విచారణ పూర్తి చేసి నిందితుడికి శిక్ష పడేలా చూడాలన్నారు. మహిళలు, ఆడబిడ్డలపై అఘాయిత్యాలు చేసే వారికి ఈ ఘటనలో పడే శిక్ష ఒక హెచ్చరికగా ఉండాలని అధికారులకు సీఎం సూచించారు.

పిడుగుపాటుకు రైతు మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి



నాగరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గుట్టపల్లె పంచాయతీ నడింపల్లెలో పొలంలో పిడుగు పడడంతో నాగరాజు(43) మృతి చెందాడు. అతని భార్య పార్వతి, తల్లి చిన్నక్కకు కూడా ఈ ఘటనలో గాయాలయ్యాయి. నాగరాజు, అతని భార్య, తల్లి ముగ్గురూ కలిసి ఆదివారం మధ్యాహ్నం పొలంలో వేరుశెనగ నూర్పిళ్లు చేస్తుండగా పిడుగు పడింది. దీంతో నాగరాజు అక్కడిక్కడే మృతి చెందగా పార్వతి, చిన్నక్కకు గాయాలయ్యాయి. గమనించిన తోటి రైతులు ముగ్గురినీ పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఆరా తీసిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్వతి, చిన్నక్కను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించాలని తెలియడంతో అక్కడి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి వారికి నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, పురం రామ్మూర్తి, సంఘం శివారెడ్డి, మహేంద్ర రెడ్డి, మహమ్మద్ పీర్, ఎన్టీఆర్ నఫీస్, గాయం వెంకటరెడ్డి, వసంతాల రాజా, ఖాదర్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన గంగాధర్, గోపి

మదనపల్లె అర్బన్, అక్టోబరు20: వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో గంగాధర్, గోపి తీవ్రంగా గాయపడిన వారిని ఆదివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఇందులో కర్ణాటక రాష్ట్రం, సోమయాజుపల్లె తాలుకా, పెగలపల్లెకు చెందిన గంగాధర్ వ్యక్తిగత పనులపై రామసముద్రం వచ్చారు. రామసముద్రం నుంచి మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యలో కాప్పల్లె వద్ద మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ముఖం, తలపై గాయాలయ్యాయి. పుంగనూరు మండలం దండుపాళ్లెం వాసి వెంకటరమణ కుమారుడు గోపి(45) ద్విచక్రవాహనంలో వెళ్లుతుండగా కొత్తయిండ్లు సమీపంలో కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనలో గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

పీఆర్‌టీయూ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

రాయచోటిటౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి డైట్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పీఆర్‌టీయూ అన్నమయ్య జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా కృష్ణయ్య, గిరిప్రసాద్ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ అన్నమయ్య జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా మూడే సూర్యుడునాయక్, ప్రధాన కార్యదర్శిగా ఉమామహేశ్వర్, జిల్లా గౌరవాధ్యక్షుడిగా అహమ్మద్‌బాషాను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ యూనియన్ ఎనలేని పోరాటాలు చేసిందన్నారు. జిల్లా నూతన కమిటీ సభ్యులు భవిష్యత్తులో ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయడం ద్వారా యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, 12వ పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ గుజ్జల తిరుపాల్, పీఆర్‌టీయూ వైఎస్ఆర్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకటశివారెడ్డి, రాష్ట్ర నేతలు మల్లికార్జునరెడ్డి, టీఎల్ నరసారెడ్డి, సాహిబ్‌జాన్, కేఎస్‌జాకీర్ హుస్సేన్, సిద్ధూనాయక్, సురేశ్, హుస్సేన్‌బాషా, మల్లికార్జునరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు, పీఆర్‌టీయూ మండల, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, సంఘ శ్రేయోభిలాషులు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో పోలీసుల తనిఖీ

- అప్రమత్తమైన వ్యాపారులు



మార్కెట్ వీధిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

జమ్మలమడుగు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులు, సిబ్బంది పట్టణంలోని పలు వీధుల్లో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఆదివారం రాత్రి 7 గంటల నుంచి ఏకకాలంలో పాత బస్టాండులోని ముద్దనూరు రోడ్డు లాడ్జీలు, వివిధ దుకాణాలు తనిఖీ చేపట్టారు. అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐలు రామక్రిష్ణ, కల్పన, ప్రొద్దుటూరు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు, ప్రొద్దుటూరు టుటౌన్ ఎస్ఐ ధనుంజయుడు, మరో 30 మంది కానిస్టేబుళ్లు తనిఖీ చేశారు. కూరగాయల మార్కెట్‌వీధిలో ఓ దుకాణం వద్ద పోలీసులు సుమారు అరగంటపాటు వేచి చూశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు బంధువుల దుకాణాల యజమానులకు అప్రమత్తం చేసినట్లు తెలిసింది. ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీ చేపట్టినట్లు పోలీసు సిబ్బంది ద్వారా తెలిసింది. పట్టణంలోని ట్రాన్స్‌పోర్టు ఆఫీసులు, లాడ్జీలు లైసెన్సులేని క్రాకర్స్ విక్రయించే దుకాణాలను తనిఖీ చేపట్టారు. పెద్దపసుపుల రోడ్డులో ఈకార్ట్ లాజిస్టిక్స్ దుకాణం, టీచర్స్ కాలనీలో తనిఖీ చేపట్టారు. పట్టణంలో పోలీసులు సంచరించడంతో అక్రమ వ్యాపారాలు చేసే కొందరు అప్రమత్తమైనట్లు తెలిసింది. కొందరు రాజకీయ నేతలు పోలీసు అధికారులకు ఫోన్లు కూడా చేసి సమాచారం అడిగినట్లు తెలిసింది. ఏదేమైనా లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని సమాచారం. పట్టణంలో సాయంత్రం నుంచి రాత్రి 9.30 గంటల వరకు పోలీసు అధికారులు, సిబ్బంది పట్టణంలో జల్లెడ పట్టారు. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం, తదితర గ్రామాల్లో కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్ సమస్యలు, విద్యార్థినులపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టి చర్యలు చేపట్టాలని, ఎక్కడైనా పాఠశాల, కళాశాలలకు బయట వెళ్లేవారి మహిళా విద్యార్థినులపై పోకిరి వారు పెట్టే ఇబ్బందులకు పోలీసులు విచారించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయం - రైతుకు ఆదాయం



- 15 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం
- ప్రకృతి వ్యవసాయ పాఠశాలతో రైతులకు సలహాలు
- ఐదంచెల సేద్యంతో అధిక లాభాలు : ఆదర్శ రైతు

నిమ్మనపల్లి, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో ఆరితేరాడు. 15 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ తాను లాభాలు పొందడమే కాకుండా ప్రకృతి వ్యవసాయ పాఠశాల ద్వారా మరింత మంది రైతులకు సలహాలు ఇస్తూ వారిని కూడా ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తవలం పంచాయతీ చౌకిళ్లవారిపల్లె రైతు గుమ్మడి గంగులప్ప సామాన్య రైతు కటుంబీకుడు. ప్రకృతి వ్యవసాయం ఆద్యుడు డాక్టర్ సుభాష్‌పాలేకర్‌ను సైతం గంగులప్ప చేస్తున్న వ్యవసాయం నిమ్మనపల్లికి రప్పించింది. ఒక ఆవుతో 30 ఎకరాలు సాగు చేయవచ్చని నిరూపించాడు. వివరాల్లోకెళితే....

చౌకిళ్లవారిపల్లె రైతు గుమ్మడి గంగులప్ప సామాన్య రైతు కటుంబీకుడు. ప్రకృతి వ్యవసాయంపై దృష్టినిలిపి ప్రకృతి వ్యవసాయంతో తాను లాభాలు పొందడమే మరింత మంది రైతులకు సలహాలు ఇస్తూ వారిని కూడా ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. బెంగళూరుకు చెందిన సురేష్ అనే రైతు తనతో మాట్లాడుతూ ఒక ఆవుతో 30 ఎకరాలు సాగు చేయవచ్చన్నారు. దీంతో ప్రకృతి వ్యవసాయంపై మక్కువతో అతడి సలహాలు తీసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాడు. అనంతరం ప్రకృతి వ్యవసాయ వైద్య విజ్ఞాన కేంద్రం పేరుతో జీవరక్షణ, గోసంరక్షణతో రిజిస్ట్రేషన్ చేసి ప్రకృతి వ్యవసాయ పాఠశాలను ప్రారంభించాడు. ప్రస్తుతం వ్యవసాయ పొలంలో ప్రకృతి నర్సరీని ఏర్పాటు చేసి వాటి ద్వారా నారును రైతులకు అందిస్తూ తాను కూడా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాడు. రైతు గంగులప్ప ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రస్తుతం క్రిమి సంహారక మందుతో పండించే పంటల ద్వారా మానవాళికి ముప్పు ఏర్పడిందని తెలిపారు. ఫలితంగా స్వచ్ఛమైన ప్రకృతి వ్యవసాయంతో

కూరగాయలు పండిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మామిడి తోటలో అంతర పంటగా మిరప, టమాట, వంగ, బీర, కాకర, బెండ, పసుపు, అనప, గుమ్మడి, అరటి, మునగ, హర్యానా సొద్దల పంటను పండిస్తున్నట్లు తెలిపారు. తనకు ఉన్న 5 ఆవుల్లో పుంగనూరు, ఒంగోలు జాతికి చెందిన ఆవులు ఉండగా వాటి ద్వారా పేడను సేకరించి పంటకు వాడుతున్నట్లు తెలిపారు. ఈ పంటలను కేవలం ఆవు నుంచి సేకరించిన పేడ ద్వారా జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసి మజ్జిగ వంటివి వేసి పంటకు వేస్తానని తెలి పారు. అలాగే నర్సరీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని రకాల కూరగాయలు ఎకరాకు 10 టన్నులు పండిస్తున్నట్లు తెలిపారు. మార్కెటింగ్ సక్రమంగా ఉంటే లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. అంతేకాకుండా పలువురు రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి సల హాలు, సూచనలు కావాలంటే 9059125954 ను సంప్రదించాలని తెలిపారు.

ఐదంచెల విధానంతో అధిక లాభాలు

ఐదంచెల విధానం అనగా ఒకటి.. భూమిలోపల పండే గడ్డజాతి ముల్లంగి,

బంగాళదుంప, రెండోది మిరప వంగ, మూడోది బీర కాకర, పొట్ల, నాలుగోది జామ, సపోట దానిమ్మ, బొప్పాయి, అరటి, మునగ ఐదోది శాశ్వత పంటలు అల్లనేరేడు మామిడి, కొబ్బరి ద్వారా అధిక లాభాలు సాధించ వచ్చని తెలిపారు.

సుభాష్ పాలేకర్‌ను పల్లెకు రప్పించిన రైతు

గంగులప్ప చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని చూసేందుకు డాక్టర్ సుభాష్‌పాలేకర్ నిమ్మనపల్లిలోని చౌకిళ్లవారిపల్లికి వచ్చి ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించి ప్రశంసించారు. 2016 హైదరాబాద్‌లో వెంకయ్యనాయుడు ద్వారా ఉత్తమ రైతు ప్రశంసా పత్రం అందుకున్న ఘనత గంగులప్పది.



ప్రకృతి వ్యవసాయంతో పండించిన అరటి



ఏపుగా పెరిగిన మునగచెట్టు చూపుతున్న రైతు గంగులప్ప



గంగులప్ప ప్రారంభించిన నర్సరీ



సలాం పోలీస్

- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- 31 వరకూ జిల్లాలో వారోత్సవాలు
- కలికిరి సీఆర్పీఎఫ్‌లో సద్భావనా దివస్ పేరుతో నేడు ప్రత్యేక కార్యక్రమాలు





కలికిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ కోసం నిరంతరం రేయింబవళ్లు కష్టించే పోలీసులకు సలాం పెట్టాలి. శెలవనే ప్రశ్న తలెత్తని ఉద్యోగం వారిది. 24 గంటలూ సేవలు చేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా వదిలేసిన అమరులకు పాదాభివందనం చేయాలి. అక్టోబరు 21 నుంచి అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడానికి జిల్లా పోలీసులు సమయాత్తమవుతున్నారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని పదిరోజులకు సరిపడా కార్యక్రమాలను రూపొందించారు. జిల్లాలో అమరవీరులను గుర్తించడం, వారికి శాశ్వత గుర్తింపుగా వీధులు, తదితర వాటికి వారి పేర్లు పెట్టడం, అమర వీరులు చదివిన పాఠశాలల్లో వారి ఫొటోలు పెట్టడం, చివరిరోజు వారి తల్లిదండ్రులను సన్మానించడం, 31న జిల్లా వ్యాప్తంగా యూనిటీ రన్, సమైక్యతా దినం నిర్వహణ, క్యాండిల్ ర్యాలీలు కార్యక్రమాలను రూపొందించారు.

సీఆర్పీఎఫ్‌కు పెను సవాళ్లు

1959 అక్టోబరు 21న అనూహ్యంగా మొదటిసారి చైనా నుంచి ఎదురు దెబ్బ తగిలి 10 మంది సహచరులను కోల్పోవడంతో సీఆర్పీ పేరు సహా సీఆర్పీఎఫ్‌గా తన దిశను మార్చుకోవలసి వచ్చింది. శత్రు దేశాలపై పోరాటాలకు పరిమితమైన సీఆర్పీ పేరు మార్చుకుని దేశ అంతర్గత భద్రతను సవాలుగా తీసుకుంది. దేశంలో ఎక్కడ బాంబుల మోత, తుపాకీల శబ్దం వినిపించినా వాటిని ఎదుర్కోవడానికి సీఆర్పీఎఫ్ సిద్ధంగా ఉంటుంది. చిన్న చిన్న అల్లర్ల అణచివేత మొదలు అత్యంత భయంకరమైన ఉగ్రవాద నిరోధం వరకూ, రాజకీయ నేతలకు భద్రత కల్పించే వరకూ శౌర్య శక్తితో ఇప్పుడు సీఆర్పీఎఫ్ దేశ వ్యాప్తంగా విస్తరించింది. సాంకేతిక, ఆయుధ సామర్థ్యం కాకుండా మూడు లక్షలకు పైగా మానవ సామర్థ్యమున్న సాయుధ బలగాల్లో ఇప్పుడు సీఆర్పీఎఫ్ ఒక్కటే అగ్రగామి.

కలికిరిలో అగ్రగామి శిక్షణ సంస్థ

సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలోని వివిధ రకాల శిక్షణ సంస్థల్లో అగ్రగామిగా చెప్పుకొనే సీఐఏటీ-3 స్కూల్ కలికిరిలో నెలకొల్పారు. కలికిరికి ఐదు కిలోమీటర్ల దూరంలో పాలెంకొండ వద్ద ఏర్పాటు చేశారు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మూడింటిలో ఇది మూడోది. సీఆర్పీఎఫ్‌లో ప్రధానంగా 203 ఎక్జిక్యూటివ్ బెటాలియన్లున్నాయి. వీఐపీ సెక్యూరిటీ బెటాలియన్‌లు ఐదున్నాయి. ఆరు మహిళా బెటాలియన్లు, 15 ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బెటాలియన్‌లు, 7 సిగ్నల్ బెటాలియన్లు మరో స్పెషల్ డ్యూటీ గ్రూపు కూడా ఉంది. అంతేకాకుండా అత్యంత చురుకైన, రాటుదేలిన బెటాలియన్.. కమాండో బెటాలియన్ ఫర్ రెసల్యూట్ యాక్షన్ (కోబ్రా) అత్యంత సాహసవంతమైందే కాకుండా శక్తివంతమైంది కూడా. బెటాలియన్‌లో వివిధ కేడర్లలో 1200 మంది ఉంటారు. బెటాలియన్‌కు కమాండెంట్ నాయకత్వం వహిస్తారు. ఒక బెటాలియన్ ఏడు కంపెనీలుగా ఉంటుంది. ఒక్కో కంపెనీకి ఒక అసిస్టెంట్ కమాండెంట్ సారథ్యం వహిస్తారు. ఇదంతా ఒక ఎత్తయితే బెటాలియన్ దళాలను సర్వసన్నద్ధులుగా తయారు చేయడానికి అనేక స్థాయిల్లో శిక్షణా కేంద్రాలు నిరంతరం పని చేస్తుంటాయి. దేశంలో మూడు ప్రత్యేక శిక్షణ కేంద్రాలున్నాయి. సీఐఏటీ (కౌంటర్ ఇన్సర్జన్సీ అండ్ యాంటీ టెర్రరిజమ్) ఉగ్రవాద నిర్మూలన, తీవ్రవాద నిరోధక శిక్షణ సంస్థ. ఇవి దేశంలో సిల్చార్ (అస్సాం)లో ఒకటి, శివపురి (మధ్యప్రదేశ్) మరొకటి వుండగా మూడోది దక్షిణాది కలికిరిలో ఉంది. సీఆర్పీఎఫ్ ప్రాంగణలోనే ఉన్న ఈ సీఐఏటీ-3 శిక్షణ అత్యంత సున్నితమైంది, మరింత కఠోరమైనదిగా చెబుతారు. శిక్షణ పూర్తయిన అనంతరం నిగ్గుదేలిన వారిని ప్రత్యేకంగా ఎంపిక చేసి చివరగా సీఐఏటీలో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో తిరిగి రకరకాల విభాగాల్లో నిష్ణాతుల్ని చేయడానికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.



కలికిరి సీఆర్పీఎఫ్ సింహద్వారం

సీఐఏటీ శిక్షణలో నిష్ణాతులు

అనేక రకాల పోరాట పటిమల్లో ఆరితేరిన వారికి కలికిరి సీఐఏటీలో శిక్షణ ఇస్తున్నారు. 175 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నెలకొల్పారు. పాలెంకొండ దిగువన దాని చుట్టూ సీఆర్పీఎఫ్ సహా 53వ ఐటీబీపీ, 65 వ బీఎస్ఎఫ్ బెటాలియన్‌లు కూడా ఉన్నాయి. 169 ఎకరాల్లో ప్రత్యేకంగా ఫైరింగ్ రేంజి ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా పది పడకల ఆస్పత్రి కూడా వుంది. శిక్షణ పొందే వారికి కాకుండా శిక్షణ అందజేసేందుకు ఉన్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి 180 కుటుంబాలకు వసతి సముదాయాలున్నాయి. సీఐఏటీ డీఐజీగా అనుపమ్ శర్మ పనిచేస్తున్నారు. ఇద్దరు కమాండెంట్లు, ఒక సెకం డ్ ఇన్ కమాండెంట్, ఐదుగురు డిప్యూటీ కమాండెంట్లు, ఐదుగురు అసిస్టెంట్ కమాండెంట్లు, 15 మంది ఇన్‌స్పెక్టర్లు, ఏడుగురు ఎస్ఐలు, 10 మం ది ఏఎస్ఐలు, 150 మంది హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు ఉన్నారు. ఇక 4 నుంచి 6 లేక 9 వా రాల పాటు శిక్షణ పొందే వారు బ్యాచ్‌లుగా వచ్చి శిక్షణ పూర్తయ్యాక వెళుతూ వుంటారు.

సంస్మరణ దినం ప్రత్యేకత

అమర వీరుల సంస్మరణ దినం సీఆర్పీఎఫ్‌కు ఎంతో ప్రత్యేకమైంది. ఏటా ప్రాంగణలో అనేక ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సీఆర్ఎఫ్ సాహస కృత్యాల ఫలితంగానే ఈ ప్రత్యేకమైన దినం ఏర్పాటైందని ఘనంగా చెబుతుంటారు. ఉదయం నుంచి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించడం, డీఐజీ భావోద్వేగ సందేశాలతో కూడిన ప్రసంగాలు, కుటుంబాలతో కలిసి ఆటల పోటీలు, రాత్రంతా సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతుల పంపిణీ, ప్రత్యేక విందులు ఏర్పాటు చేస్తారు. సీఐఏటీ ప్రత్యేకత దృష్ట్యా సీఆర్పీఎఫ్ డీజీపీ కూడా తరచూ హాజరవడం రివాజు.

210లీటర్లు నాటుసారా సీజ్ - ఒకరి అరెస్ట్



నాటుసారా, నిందితుడితో ఎస్ఐ శ్రీహరి

వాల్మీకిపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గండబోయనపల్లెలో ఆదివారం విస్తృత దాడులు చేసి 210 లీటర్ల నాటుసారా సీజ్ చేసి గురునాథ్‌ను అరెస్టు చేశారని ఎస్ఐ శ్రీహరి తెలిపారు. కొండకింద మేకలవారిపల్లె అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ బట్టీలపై దాడులు చేశారన్నారు. బట్టీలు, 5వేల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. 210లీటర్ల నాటుసారా సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేయగా రెడ్డెప్ప, నాగరాజు పరారయ్యారన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది దస్తగిరి, వెంకటేష్, గంగరాజు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ లక్ష్యం

- నాణేలు సేకరణలో వసీమా అస్లాం
- ఇప్పటికే 30 దేశాల నాణేలు, నోట్లు, మెడల్స్ సేకరణ

రైల్వేకోడూరు, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్‌లో పేరు సంపాదించాలన్న లక్ష్యంతో ఓ యువకుడు దేశ విదేశాలకు చెందిన అనేక నాణేలను సేకరిస్తున్నాడు.

రైల్వేకోడూరు వాసి వసీమాఅస్లాం బీటెక్ చదివాడు. తండ్రి నడుపుతున్న హోటల్‌లో చేదోడువాదోడుగా ఉంటూనే వివిధ దేశాలకు చెందిన నాణేలు, నోట్లు, మెడల్స్ తదితరాలను సేకరిస్తున్నాడు. క్రీస్తు పూర్వం 200, 300 ఏళ్ల నాటి నాణేలు, మౌర్యులు, శాతవాహనులు, చోళులు, మట్లిరాజులు, నిజాం నవాబులు, ఢిల్లీ సుల్తాన్ కాలంలో చలామణిలో ఉన్న నాణేలు, ఇండియా, దుబాయ్, కువైట్, కత్తర్, సౌదీ, బెహరిన్, పాకిస్తాన్, కెనడా, సింగపూర్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, లండన్, రష్యా, చైనా, యూరప్ తదితర దేశాల్లో వివిధ కాలాల్లో చలామణిలో ఉన్న నాణేలు, కరెన్సీ, ప్రపంచ యుద్ధంలో సైనికులకు ఇచ్చిన పతకాలు సేకరించాడు. ఇప్పటి వరకూ 75,250 నాణేలు సేకరించినట్లు ఆయన చెబుతున్నాడు. వీటితో పాటు కొలంబియాలో పాతకాలం నాటి గ్రామ్‌ఫోన్ రికార్డులు, పెన్నులు తదితరాలను కూడా సేకరించాడు. చిన్నతనం నుంచే నాణేలు తదితరాల సేకరణ అలవాటుగా మార్చుకున్న అస్లాం వద్ద ప్రస్తుతం భారత దేశానికి చెందిన నాణేలు, స్వాతంత్ర్యం నాటి నుంచి మనుగడలో ఉన్న ఉన్న నాణేలు కూడా ఉన్నాయి. సేకరించిన నాణేలు, కరెన్సీ తదితరాలను పలు ప్రాంతాల్లో, ప్రదర్శిస్తూ చరిత్రపై అవగాహన కల్పిస్తున్నాడు.

గిన్నిస్‌బుక్‌లో స్థానం కోసం శ్రమిస్తున్నా



నాణేలు, కరెన్సీలు, మెడల్స్ సేకరణతో గిన్నిస్ బుక్ రికార్డును సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. చిన్నతనంలోనే నాణేలు, కరెన్సీలు సేకరించాలని భావించాను. దీనినే లక్ష్యంగా కృషి చేస్తున్నా. లిమ్కాబుక్ రికార్డు బ్రేక్ చేసేందుకు అవసరమైనన్ని నాణేలు సేకరించా. గిన్నిస్‌బుక్‌లో స్థానం కోసం నాణేలు సేకరించాల్సి ఉంది.

- వసీమా అస్లాం, రైల్వేకోడూరు



వివిధ రకాల విదేశీ కరెన్సీ



గ్రామ్‌ఫోన్ రికార్డ్, ఇండియన్ కరెన్సీ



నవానగర్, ఢిల్లీ సుల్తాన్‌కు చెందిన నాణేలు



నిజాం పాలనలో వెండి నాణేలు

విజయనగర పాలనలో ఉన్న బంగారు నాణేలు

శిక్షణ కార్యక్రమాలను వాయిదా వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో 1,2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి 26 వరకు రెసిడెన్షియల్ పద్ధతిలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వడం వల్ల వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు, బాలింతలు, చిన్న పిల్లల తల్లిదండ్రులు, బాధ్యతలు చూసుకోవాల్సిన ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక వత్తిడికి గరవుతున్నారన్నారు. పాఠశాల పనివేళల్లో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టడం వల్ల ప్రభుత్వ పాఠశాల్లో విద్యాబోధనకు తీవ్ర అంతరాయం కలుగుతుందని.. వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, రామచంద్రరెడ్డి, మణికుమార్, మస్తాన్‌బాబు పాల్గొన్నారు.

పుష్పగిరి క్షేత్రంలో హైకోర్టు జడ్జి



వల్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పుష్పగిరి క్షేత్రంలో ఆదివారం హైకోర్టు జడ్జి కృష్ణమోహన్ శ్రీకామాక్షి సమేత వైద్యనాథున్ని దర్శించుకున్నారు. ఈసందర్భంగా జడ్జికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కామాక్షి సమేత వైద్యనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జి పుష్పగిరి మఠం చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన పుష్ప గిరి క్షేత్రాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తహసీల్దారు శ్రీవాణి, స్థానిక అధికారులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు బయలుదేరిన ఆశాలు



కడప రైల్వేస్టేషన్‌లో ఆశా కార్యకర్తలు

కడప (మారుతీనగర్), అక్టోబర్ 20: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న తలపెట్టిన చలో విజయవాడ (మహాధర్నా) కార్యక్రమానికి ఆదివారం పెద్ద ఎత్తున ఆశా కార్యకర్తలు కడప రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వి.సుభాషిణి మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి పలు ఉద్యమాలు చేసినప్పటికీ ప్రభుత్వాలు స్పందించ లేదన్నారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మంత్రులకు , అధికారులకు అనేక మార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఇంతవరకూ అతీగతీ లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి తమకు ఇచ్చిన హామీలు త్వరితగతిన నెరవేర్చాలని కోరారు. లేదంటే సమరశీల పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతమ్మ, ఉపాధ్యక్షురాలు అనసూయ, అమ్ములు, దేవి నారాయణమ్మ, రాజేశ్వరి, ముకుంద, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని హత్య చేసిన నిందితున్ని ఉరి తీయాలి : ఆర్‌ఎస్ యూ



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఆర్‌ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో బాలికపై అత్యాచారం చేసి నిప్పంటించి ఆ మె మృతికి కారణమైన నిందితున్ని ఉరి తీయాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ప్రభుత్వ బాలుర బీసీ వసతిగృహంలో ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జీవితంపై ఎన్నో ఆశలతో కష్టపడి చదువుకుంటున్న బాలికపై స్నేహితుడి ముసుగులో విఘ్నేశ్ దారుణానికి పాల్పడ్డాడని, ఇది చాలా దారుణమని అన్నారు. తనకు వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యు నాయకులు కొండేటి, వెంకటేశ్, ధనుంజయ్, సాయికుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డయల్ 100, 112 సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్పీ

కడప క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసు హెల్ప్‌లైన్ నంబర్లు డయల్ 100, 112 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియాలో పై నెంబర్లు పనిచేయడం లేదంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని, రెండూ పోలీసు హెల్ప్‌లైను నెంబర్లు యదావిధిగా పనిచేస్తున్నాయని ఎస్పీ తెలిపారు.

మండలి బుద్ధప్రసాద్‌ను కలిసిన హరిప్రసాద్



మండలి బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న హరిప్రసాద్ తదితరులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. మైదుకూరు జనసేన నాయకులు లక్ష్మిభరత్, పసుపులేటి నాగమల్లిఖార్జున్ పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం... దెబ్బతిన్న పంటలు



నర్సనపల్లెవద్ద వర్షానికి నిలువునా చనిపోతున్న మిరప



ఇటుకులపాడువద్ద నేలకు వాలిపోయిన వరిని చూపుతున్న మహిళ



గంగనపల్లెవద్ద పొలాలల్లో కుల్లిన మినుము కుప్పలు

కాశినాయన, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షం రైతన్నకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. ప్రకృతి ప్రకోపానికి పంటలు సాగుచేసిన రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో గత రెండు మూడురోజులుగా కురి సిన ఎడతెరిపిలేని వర్షాలకు చేతికి అందివచ్చిన వరి, మినుము, ఉల్లి, మిరప లాంటి అనేక పంట లు దెబ్బతిన్నాయి. ఇటుకులపాడు , రామచంద్రా పురం తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన దాదాపు 50 ఎకరాల్లో వరి పంట కిందపడి పోయి ధాన్యం మొలకలు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సాపురం, మూలపల్లె, నరసన్నపల్లె తదితర గ్రామల్లో నీరు ఎక్కువై మిరప చేలు నిలు వునా చనిపోతున్నాయి. గంగనపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలో కోసి కుప్పలు వేసిన మినుము పంట ఎడతెరిపి లేని వర్షంతో కుళ్లిపోయింది. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టించి సాగుచేసిన పంటలు కళ్లముందే వర్షానికి దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈవిష యంపై మండల వ్యవసాయాధికారి జయలక్ష్మిని వివరణ కోరగా ఇటీవల కురిసిన వర్షాలకు పలు రకాల పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో వరి 45 ఎకరాలు, మినుము 40 ఎకరాలు, మిరప 50 ఎక రాలు, ఉల్లి 18 ఎకరాల్లో దెబ్బతిందన్నారు. ఈ మేరకు నివేదికలు తయారు చేసి జిల్లా అధికారులకు అందజేశామని తెలిపారు.

కోతకు వచ్చిన పంట నేలపాలు



ఇటీవల కురిసిన వర్షానికి కోతకు వచ్చిన వరి నేలపాలైంది. రూ.లక్షకుపైగా పెట్టుబడితో 3 ఎకరాల్లో వరి పంట సాగుచేశాను. గాలి వానకు నేలవాలిపోయి పొలంలోనే మొలకలు వస్తున్నాయి. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.

-వి.నాగ సుబ్బారెడ్డి, ఇటుకులపాడు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



నాలుగు ఎకరాలు మిరప (సన్నాలు) పంట సాగు చేశాను. ఇప్పటికే రూ.3.5 లక్షలు పెట్టుబడి అయ్యింది. పూత, కాయ దశలో ఉన్న పంట ఇటీవల కురిసిన వర్షానికి నీరు ఎక్కువై చెట్లు నిలువునా చనిపోతున్నాయి. దీంతో పెట్టుబడులు కోల్పోవాల్సిన పరిస్థితి. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

-బి.రమణయ్య రైతు నర్సనపల్లె.

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం





స్వర్ణోత్సవాల్లో భాగంగా ర్యాలీగా వస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు, మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ అలుగపెరగని పోరాటం చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేఏసీ సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ మనందరి బాధ్యత అని తెలిపారు. ఆదివారం యూటీఎఫ్ భవన్‌లో స్వర్ణోత్సవ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు స్వర్ణోత్సవాల్లో భాగంగా కడప కోటిరెడ్డిసర్కిల్ నుంచి సంధ్యాసర్కిల్ మీదుగా యూటీఎఫ్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ స్థాపిం చి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు చేసుకుంటున్నామన్నారు. అందరికీ సమాన అవకాశాలు ఉండాలనే ఉద్దేశ్యంతో సోషలిస్టు సమాజం కోసం యూటీఎఫ్ ఏర్పాటు చేశారన్నారు. ఎన్నో లక్ష్యాలు, ఆశయాలు డిమాండ్లను సాధించుకున్నామన్నారు. హక్కుల కోసం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఎంతో పోరాటం చేశామని తెలిపారు. ప్రత్యామ్నాయ విద్యావిధానం కోసం పోరాడింది యూటీఎఫ్ మాత్రమేనని తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ యూటీఎఫ్ జిల్లాలోని అన్ని మండలాల్లో ఉండడం హర్షణీయమన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ స్థాపించడం జరిగిందని.. అప్పటి నుంచి విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు రమాదేవి, గంగిరెడ్డి, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు రవికుమార్, జేఈఈ నాయకులు షమీర్‌బాషా, యటిఎఫ్ నాయకులు నాగార్జునరెడ్డి, రవికుమార్, నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

సోంపల్లెలో ఘర్షణ.. ఆరుగురికి గాయాలు

ముద్దనూరు అక్టోబరు 20: మండల పరిధి సోంపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చేసుకోవడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. సీఐ దస్తగిరి సమాచారం మేరకు వివరాలు... మండల పరిధి సోంపల్లె గ్రామానికి చెందిన మూలె నాగమునిరెడ్డి, ఎర్రంరెడ్డి రామక్రిష్ణారెడ్డి కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. రెండు కుటుంబాలు కట్టెలు, రాడ్లతో ఘర్షణకు పాల్పడటంతో ఇరు కుటుంబాలకు చెందిన ఆరుగురికి రక్త గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని గాయపడిన వారిని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్మీ జవాన్ రాజేష్ అంత్యక్రియలు నేడు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్ లోని అబుజ్‌మడ్ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన బాంబు పేలి మండలంలోని పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రాజేష్ (37) అనే జవాను మృతి చెందిన విషయం తెలిసిందే.. రాజేష్ మృతదేహం ప్రస్తుతం ఆదివారం బెంగుళూరు నుంచి స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రాజేశ్ 2007 నుంచి ఐటీబీపీలో జవానుగా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులు జానయ్య, బాలమ్మ గ్రామంలో వ్యవసాయ కూలీల పనులు చేసుకుంటూ కుమారుడిని చదివించారు. వీరికి ముగ్గురు మగపిల్లలు. ఇరు వు రు ఆడపిల్లలు సంతానం. మృతి చెందిన రాజేశ్ నాలుగవ సంతానం. రాజేశ్‌కు భార్య, ఇరువురు కుమా రులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య పాపిరెడ్డిపల్లెలోనే ఉంటూ పిల్లలను చదివి స్తో ంది. రాజేశ్ మృతితో గ్రామంలో విషాధయలు అలుముకున్నాయి.

పిడుగు పాటుకు 18 పొట్టేళ్లు మృతి



గాలివీడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూముకుంట గ్రామం నాయునివారిపల్లెలో కొర్రు రామప్ప నాయుడుకు చెందిన 18 పొట్టేళ్లు పిడుగుపాటుకు మృతి చెందాయి. బాధితుడి వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం నాయునివారిపల్లె తూర్పు వైపున తెల్లకొండ సమీపంలోని పంట పొలాల్లో పొట్టేళ్లు మేస్తుండగా ఒక్కసారిగా ఉన్నట్లుండి పిడుగు పడటంతో 18 పొట్టేళ్లు మృతి చెందాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టేళ్ల విలువ దాదాపు 2.50 లక్షలు ఉంటుందని, తాను తీవ్రంగా నష్టపోయానని రైతు బోరున విలపించారు. పిడుగుపాటు కు తాను కూడా గాయపడ్డానని, 10 నిమిషాల పాటు మతి లేకుండా పోయిందని తెలిపారు. సంఘటన తెలిసిన వెంటనే సర్పంచ్ కుమార్‌నాయుడు, వీఆర్‌వో శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ భద్రప్పనాయుడు, టీడీపీ కదిరిరెడ్డి నాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నష్టపరిహాన్ని అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కోతికి అరటి పండు పెట్టాడని..

యువకుడికి కత్తిపోట్లు.. చికిత్స ● రేణిగుంట-మామండూరు మధ్య ఘటన



రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీల్‌కుమార్

రైల్వేకోడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైలులో ఓ వ్యక్తి దగ్గర ఉన్న కోతికి అరటి పండు పెట్టాడని కోతి నిర్వాహకుడు యువకుడిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆదివారం తిరుపతి జిల్లా రేణిగుంట-మామండూరు మధ్యలో జరిగింది. గాయపడిన వ్యక్తికి రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేశారు. బాధితుడి వివరాల మేరకు... ఆదివారం ఉదయం ఓబులవారిపల్లె మండల పరిధిలో ఉన్న బొంతవారిపల్లె దళితవాడకు చెందిన జవ్వాది లక్ష్మయ్య, రేవూరి సునీల్‌కుమార్, పందుగోల శేఖర్ తదితరులు మద్యం ఎక్కువగా తాగేవారు. వీళ్లు రేణిగుంట మండల పరిధిలోని కరకంబాడి గ్రామ సమీపంలో ఉన్న కట్టావుట్టాలమ్మ దేవస్థానం వద్దకు వెళ్లి మద్యం తాగకుండా దేవుడి వద్ద ప్రమాణం చేసి పూజలు నిర్వహించి.. రైల్వేకోడూరుకు వచ్చేందుకు సంధ్యాలకు వెళ్లే రైలును ఎక్కడానికి రేణిగుంటకు వెళ్లారు. అక్కడ రైలు ఎక్కగానే ఒక వ్యక్తి కోతిని పట్టుకుని ఉండటాన్ని సునీల్‌కుమార్ గుర్తించాడు. తన దగ్గర ఉన్న స్వామి ప్రసాదం అయిన అరటి పండును తీసుకుని కోతికి పెట్టడంతో ఉన్నఫళంగా కోతి నిర్వాహకుడు సునీల్‌కుమార్‌పైకి గొడవకు దిగాడు. ఇరువురి మధ్య మాటమాట పెరిగింది. కోతి పట్టుకుని ఉన్న వ్యక్తి తన దగ్గర ఉన్న చిన్నపాటి కత్తితో సునీల్‌కుమార్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో సునీల్‌కుమార్ తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం పక్క బోగీలో ఉన్న సునీల్‌కుమార్ బంధువులకు తెలిసి వారు రావడంతో బాలపల్లె రైల్వేస్టేషన్‌లో కోతిని పట్టుకున్న వ్యక్తి దిగి పరారయ్యాడు. గాయపడిన సునీల్‌కుమార్‌ను రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. సమాచారం తెలిసిన స్థానిక పోలీసులు విచారించారు. సంఘటన తమ పరిధిలోకి రాదని తెలపడంతో విచారణ చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ రవి తెలిపారు.

రచయితల మహాసభకు మండలికి ఆహ్వానం

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల మహాసభకు తెలుగుభాషా సేవకులు భాషోద్ధారకులు, శాసనసభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్‌ను ఆహ్వానించినట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూల మల్లిఖార్జున రెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మండలిని రచయితల సంఘం సభ్యులు కలిసి 2025 జనవరిలో జరిగే మహాసభలకు రావాలని ఆహ్వానం అందించారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ కె.శేఖర్‌రెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి పలువురు పాల్గొన్నారు.

నిందితుల కోసం కొనసాగుతున్న వేట

కడప క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై కర్రలతో దాడి చేసిన నిందితుల కోసం పోలీసు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం అప్సర నుంచి ఇంటికి వెళుతున్న క్రమంలో ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు కర్రలతో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తుంది. దాడి చేసిన వారిలో ఒకరిని గుర్తించి.. అతన్ని పట్టుకునేందుకు వేట సాగిస్తున్నారు. అయితే దాడికి గల కారణం సొంత పార్టీ వర్గమా లేక ఇతరులు ఎవరైనా దాడి చేశారా అన్న విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

గండికోటప్రాజెక్టులో నిలకడగా నీటి మట్టం



కొండాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గండి కోట ప్రాజెక్టులో ఆదివారం సాయంత్రానికి 26.22 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో గాని ఔట్‌ఫ్లో గాని లేనందున నీటిమట్టం నిలకడగా ఉందన్నారు. గండికోట అనుబంధ రిజర్వాయర్లలో కూడా నీటిమట్టం పూర్తిస్థాయిలో ఉన్నందున నీటిని ఎక్కడికి వదలడం లేదన్నారు. తదుపరి వచ్చే నీటిని బట్టి ఇతర రిజర్వాయర్లకు నీరు వదిలే అవకాశం ఉంటుందని డీఈ తెలిపారు.

నేటి నుంచి డిగ్రీ ఒకేషనల్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో నాలుగేళ్ల యూజీ హానర్స్ ఒకేషనల్ రెండో సెమిస్టరు పరీక్షలు ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నిర్వహణ అధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎంఎల్‌టీ, డైరీ సైన్స్ చదివే విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఈ నెల 28 వరకు (27 మినహా) ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 11 వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లను చదువుతున్న కళాశాల నుంచి పొందాలని సూచించారు.

In the Court of the Honourable Additional Senior Civil Judge, Kadapa
I.P. No. 42 / 2024

Vadipilla Ashok Kumar, Son of V. Sreenivasulu, aged 36 years, Hindu, Un-Employee, residing at D.No. 1-26, Theliki Village, Jangamreddypalle Post, Simhadripuram Mandal, Kadapa Dt. **- Petitioner/Debtor**

Vs

1) Lingadari Bhaskar, Son of L. Chandra Paul, aged 45 years, resident of Theliki Village, Jangamreddypalle Post, Simhadripuram Mdl, Kadapa Dt., **2)** Smt. Rachamallu Pushpha Wife of R. Parameswara Reddy, aged 43 year, resident of D.No. 3-147, Himakunta Village, Simhadripuram Mandal, Kadapa District, **3)** Kona Narasimha Reddy Son of K.N. Reddy, aged ... years, residing at D.No. 8/2, BBD Colony, Simhadripuram Town and Mandal, Kadapa District, **4)** Shaik Yakub Basha Son of Ismail, aged about... uyears C/o Madina Medicals, Yellanur Road, Tadipatri Town, Anantapur District, **5)** D. Mahammad Vali Son of Mahaboob Peera, aged ... years, residing at D.No. 5-279, Allabakash Street, Tadipatri Town, Anantapur District, **6)** M. Venkatesh Naik, Father;s name not known, aged... years, working as Police Constable in Tadipatri Rural Police Station, Tadipatri Town, Anantapur Dist. **7)** S. Chand Basha Son of Mabu Valli, aged... years, residing at Pedda Yakkalauru Village, Pedda Pappur Mandal, Anantapur Dist. **8)** V. Venkata Krishna son of V. Pullaiah, aged.... years resding at D.No. 2-316-8, Ragithotapalem, Tadipatri Town, Anantapur Dist., **9)** J. Harish Reddy Son of J.Bhaskar Reddy, aged ... years, C/o Sangeetha Mobiles, Yellanur Road, Tadipatri Town, Anantapur Dist., **10)** P. Rama Chandra Reddy Son of Ranga Reddy, aged... years, residing at D.No. 3-352, Reddyvaripalem, Tadipatri Town, Anantapur District, **11)** Y. Ramana Reddy son of Y. Krishna Reddy, aged... years, residing at D.No. 4-112, Yerraguntapalli Village, Tadipatri Mandal, Anantapur District, **12)** G. Mahesh Reddy, Son of G. Papi Reddy, aged about.... years, residing at Gangadevipalli Village, Tadipatri Mandal, Anantapur District, **13)** Chintha Siva Sankar Reddy, son of C.Rami Reddy, aged about... years, residing at Veerapuram Village, Tadipatri Mandal, Anantapur District, **14)** Chintha Siva Sekhar Reddy, son of C. Narasimha Reddy, aged about... years, residing at Veerapuram Village, Tadipatri Mandal, Anantapur District, **- Respondents/ Creditors**

జనరల్ నోటీసు

పైన తెలిపిన పిటిషనర్/డెబ్టార్ తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ రాజశ్రీ కడప అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఐ.పి. నెం. 42/2024 పైన తెలిపిన రెస్పాండెంట్స్ /క్రెడిటార్స్ పైన దాఖలు చేసినాడు. సదరు ఐ.పి. 23-10-2024వ తేదిన వాయిదా ఉన్నది. సదరు ఐ.పి. నందు ఎవరికైనా, ఏవైనా ఆక్షేపణలు ఉన్న యెడల 23-10-2024వ తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా కానీ, వకీలు గారి ద్వారా కానీ హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడవు.

వాయిదా తేది : 23-10-2024

శ్రీ జె. పుల్లయ్య, B.A., B.L., అడ్వకేట్, ప్రకాష్‌నగర్, కడప.

ప్రభుత్వం అందించే ప్రతి రూపాయి ప్రజలకే

● ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం ● మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ● ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

చెన్నూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందించే ప్రతి రూపాయి ప్రజలకే దక్కేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని కొండపేట గ్రామంలో సిమెం టు రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పల్లెల్లో నిత్యం పండుగ నెలకొనాలన్న సదుద్దేశ్యంతో కోట్లాది రూపాయలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ ప్రభుత్వం మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు.

వల్లూరు: పెద్దలేబాక పంచాయతీలోని చిన్ననాగిరెడ్డిపల్లెలో సీసీ రోడ్డు, గోకులం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాన చేశారు. టీడీపీ మం డల నాయకుడు నాగేశ్వర్‌రెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

సీకేదిన్నె: బుగ్గలపల్లె పంచాయతీ నాగిరెడ్డిపల్లెలో ఆదివారం పల్లెపండుగ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కుళాయిబాబు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఏపీఓ రామాంజనేయులరెడ్డి, కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల బలోపేతమే లక్ష్యం: ఎమ్మెల్యే

పెండ్లిమర్రి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల బలోపేతమే కూటమి ప్ర భుత్వ లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొత్త గంగిరెడ్డిపల్లె పంచాయతీలోని సోగాలపల్లె, నందిమండలం గ్రామాల్లో ఆదివారం పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా సీసీరోడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

అన్ని గ్రామాల్లో రోడ్లు ఏర్పాటుకు కృషి

వేంపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్లు లేని ప్రతి గ్రామంలోను సిమెంటు రోడ్లు ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తామని టీడీపీ వేంపల్లె మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి తెలిపారు. ఇడుపులపాయ ఎస్సీకాలనీలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 10లక్షల వ్యయంతో సిమెటు రోడ్డు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు.

‘జీఓ 117 రద్దుతో ప్రభుత్వ పాఠశాల విద్యకు మహర్దశ’

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ 117 పాఠశాల విద్యను అతలాకుతలం చేసిందని ఆ జీఓను టీడీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో పాఠశాలలకు మహర్దశ వచ్చినట్లని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోజ్జ తిరుమలేశ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం జీఓ 117ను రద్దు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



అట్టహాసంగా కడప జిల్లా ఆవోపా ప్రమాణ స్వీకారం

చక్రాయపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గండి క్షేత్రంలోని వాసవి ఆర్యవైశ్య నిత్యన్నదాన సత్రంలో కడపజిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబు నూతన కార్యకర్తతో ప్రమాణస్వీకారం చేయించారు. ఆవోపా జిల్లా నూతన అధ్యక్షుడిగా గూడూరు హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు, కార్యదర్శులు, ఉప కార్యదర్శులు, కోశాధికారులు, ఈసీ సభ్యులు తదితర కార్యకర్గసభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గండి వాసవి ఆర్యవైశ్య నిత్యన్నదాన సత్రం గౌరవాధ్యక్షుడు రాయవరం శివరావు, అధ్యక్షుడు పచ్చిపులుసు మురళీకిషోర్, వేంపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర, వేంపల్లె ఆఓపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్‌కుమార్, ఆఓపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్రీసనల్ ఉపాధ్యక్షుడు అంబికేశ్వరశెట్టి, వేంపల్లె ఆవోపామహిళా విభాగ్అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణ, ఉపాధ్యక్షురాలు బైరిశెట్టి నాగలక్ష్మి, కార్యదర్శి గోనుగుంట్ల సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె పాపాఘ్నిలో ఇసుక ట్రాక్టర్ల జాతర



వేంపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుకను ట్రాక్టర్లతో, ఎడ్లబండ్లతో తోలుకోవచ్చని చెప్పడంతో వేంపల్లె పాపాఘ్నిలో ట్రాక్టర్ల జాతర కనిపించింది. ఇప్పటి వరకు దొంగచాటుగా రాత్రివేళల్లో ఇసుకను తోలుకుంటున్న కొందరు ట్రాక్టర్ల యజమానులతో పాటు ట్రాక్టర్లను పక్కనపెట్టిన వారుసైతం ఆదివారం నదికి ఇసుక కోసం పరుగులు తీశారు.

భవిష్యత్తు ప్రణాళిక ఉంటే విజయం మీదే

● ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తు ప్రణాళిక ఉంటే విజయం మీ సొంత మవుతుందని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరం అక్కాయపల్లె సాయిబాబా విద్యాసంస్థల్లో పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆరోగ్యానికి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యంతో ముం దుకు సాగాలన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస ప్రేరకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే విజయం సాధిస్తారన్నారు. పాఠశాల వైస్ ఛైర్మన్ సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రణాళికబద్ధంగా చదవిస్తున్నామన్నారు. 46వ డివిజను కార్పొరేటరు శ్రీదేవి మాట్లాడుతూ పోయిన సమయాన్ని ఎంత ఖర్చు పెట్టినా తీసుకురాలేమన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వేంపల్లె, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేంపల్లె చైతన్య హైస్కూల్లో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కడప ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ వంశి విహారి, డాక్టర్ సాయి చరిత, డాక్టర్ గద్దె శివబాబులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. బిపి, షుగర్, థైరాయిడ్, ఊపిరితిత్తుల జబ్బులకు పరిశీలించి ఉచితంగా మం దులు అందించారు. మానవత చైర్మన్ చక్రపాణిరెడ్డి, అధ్యక్షులు చల్లా బా లాజి, మానవత ప్రతినిధులు రామమునిరెడ్డి, తేజ, డాక్టర్ రంగయ్య, శ్రావణ్‌కుమార్, యోగీశ్వర్, రాజారామ్, శ్రీకళ పాల్గొన్నారు.

మట్కా అరికట్టేందుకు కృషి: డీఎస్పీ

పులివెందుల టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల ప్రాంతంలో మట్కా, గ్యాంబ్లింగ్‌ను అరికట్టేందుకు కృషిచేస్తామని డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పులివెందుల సబ్ డివిజను పరిధిలో దాదాపు 150 కెమెరాల దాకా అవసరం ఉన్నాయని, సీనియారిటీని బట్టి కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. షాపుల యజమానులు కూడా రోడ్లు కవరయ్యేలా కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసులకు సహకరించాలని కోరారు. ఆదివారం తెల్లవారుజామున ఎస్పీ ఆదేశాలతో నలుగురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 150మంది సిబ్బందితో కలిసి నగరిగుట్టలో కార్డెన్ సెర్చ్ చేశామని, 50 లీటర్ల నాటుసారా, పత్రాలు లేని 20 బైకులను స్వాధీనం చేసుకుని ఒక మట్కా బీటరును అరెస్టుచేశామన్నారు.







ఊపందుకున్న సభ్యత్వ నమోదు

కడప (మారుతీనగర్), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు ఊపందుకున్నదని ఆ పార్టీ అధికార ప్రతినిధి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు కందుల మురళీమోహన్‌రెడ్డి, బాలకృష్ణయాదవ్, జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

‘మహిళలకు ఉచిత బస్సు ఊసేదీ’

కడప(కలెక్టరేట్), అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి):చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ నాలుగు నెలలుగా ఆ ఊసే ఎత్తడం లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కడపలో కడప- యర్రగుంట్ల ఆర్టీసీ బస్సులో తోటి మహిళలతో కలిసి ప్రయాణం చేసి నిరసన వ్యక్తం చేశారు. పీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు బండి జకరయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు సయ్యద్ సలావుద్దీన్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

కడప నాగరాజుపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాలు చేపట్టాలని ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ నాయకులు ఆదివారం ఏపీట్రాన్స్‌కో కడప చీఫ్ ఇంజనీరుకు విన్నవించారు. నూతన సబ్‌స్టేషన్‌లో, ఖాళీ ఉన్న సబ్‌స్టేషన్లలో బదిలీకి అనుమతి ఇవ్వాలన్నారు. అందుకు చీఫ్ ఇంజనీరు స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేస్తామని పేర్కొన్నారని తెలిపారు. రాష్ట్ర కమిటీ నాయకులు ఎం.సుధాకర్, రవినాయక్ పాల్గొన్నారు.





PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd. Kadapa-II branch issues the following notice to the general public. My client intend to grant loan to **Tadigotla Nagabhushana Reddy** S/o Tadigotla Pedda Obul Reddy, resident at D.no: 42/63, NGO Colony, Chinna Chowk, Kadapa City by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 7days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTY** : Kadapa Dt. Kadapa Urban Sub District, Kadapa City within Kadapa Muncipal Corporation, Corporation Ward No. 42, Chinna Chowk, NGO Colony, house with old D.No. 7/63, present D.No. 43/63 to an extent of Ac. 0.08 cents and 904 sq. links or 431 sq.yards in Plot No. 54, located in Sy.Nos. 91/1 and 752/2 of Chinna Chowk Village fields, **BOUNDARIES** : EAST : Site in Plot No. 55, WEST: Site in Plot No. 53, NORTH: Site in Plot No. 90, 97,98, SOUTH: Road.

Yours faithfully


SHIAK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram finance ltd Pulivendula branch issues the following notice to the general public. My client intend to grant loan to Sri. Saginala Budde Saheb, S/o S. Kullayappa residing at D.no: 4-3-213, Bethel Church, Pulivendula town, YSR Kadapa district by mortgage. As such if anyone has any claims ,objections charges or mortgages sale agreements , court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTIES ;** Kadapa District, Kadapa rural Sub-District, Valluru Mandal, Tholaganganapalle Grama Panchayathi, Tholaganganapalle village fields Vacant Site Situated At SY No: 98/1B,98/2B,100/1B,100/2B ,101/1B&101/2B, plot No. 87A, 87B, 88A "Shabbir Golden city plots" An Extent Of 7.575 Cents or 366.66 Sq Yards with in the following **Boundaries ;** EAST : 33 feet wide road, WEST : Plot Nos. 74A, 74B& 73A , NORTH : Plot No. 86B, SOUTH : Plot No. 88B.

A. PRATHAP REDDY
ADVOCATE, PULIVENDULA

















ఆదమరిస్తే.. అంతే..!

● డేంజర్‌గా మారిన ఎన్‌హెచ్ రోడ్డులోని గుంతలు ● రాత్రి పూట ద్విచక్రవాహనాలకు ప్రమాదాలు




కడపరోడ్డులోని జువారీ బ్రిడ్జి వద్ద పడిన లోతైన గుంత, పోలీసుస్టేషన్ వద్ద పడిన తోలైన గుంత

ఎర్రగుంట్ల, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలోని ఎన్‌హెచ్‌రోడ్లు గుంతలమయంగా మారాయి. అసలే నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి ఈరోడ్లు నిర్మించారని అనేక సార్లు ఫిర్యాదులు వచ్చాయి. ఈవిషయంపై పత్రికల్లో రావడం తెలిసిందే. దీనికి తోడు డ్రైనేజీ వ్యవస్థలేకుండా కోటానుకోట్లు వెచ్చించి నిర్మించినా రోడ్లు వర్షార్పణం అవుతున్నాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎన్‌హెచ్‌రోడ్డు పాడైంది. ఎర్రగుంట్ల నగరపంచాయతీలో మరీ ఎక్కువగా ఉంది. నాలుగురోడ్ల కూడలి కడపరోడ్డులో, జువారి సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్లే రైల్వే బ్రిడ్జి వరకు రోడ్డులో భారిగా గుంతలు పడటంతో వాహనాలు గుంతల్లో పడి నాశనమౌతున్నాయి. ద్విచక్రవాహనాలు వేగం గా వచ్చి ఈ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవు తున్నారు. ముఖ్యంగా రాత్రి వేగంగా వచ్చే వాహనదారులు గుంతలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. శని, ఆదివారం రాత్రి ప్రమాదాలు జరిగాయి. టౌన్‌లో పోలీసుస్టేవద్ద భారీ గుంతపడింది. సుంకులమ్మ గుడి వద్దనుంచి చాలా చోట్ల గుంతలు పడ్డాయి. చాలా చోట్ల రోడ్డు చీలిపోయి ఇబ్బందికరంగా మారింది. వెంటనే ఎన్‌హెచ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇక మార్కెట్ యార్డు వద్ద, బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌ల కు ఎదురుగా వర్షపు నీరు ఇప్పటికీ అలాగే ఉండటం తో వ్యాపారాలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని దుకాణదారులు వాపోతున్నారు.

గుంతలు పూడ్చకపోతే ఆందోళన

బద్వేలు, అక్టోబరు 20,(ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలోని సిద్దవటం రోడ్డు, కరెంటు ఆఫీసు వద్ద మెయిన్‌రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, తక్షణమే ఆర్అండ్‌బీ అధికారులు గుంతలు పూడ్చకపోతే ఆందోళనలు చేపడతామని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని పేర్కొన్నారు. ఆదివారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గుంతల వద్ద నిరసన చేపట్టారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుమస్తాన్,బాలగుర్రయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

చాపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయాల సంస్థ కార్యదర్శి సయ్యద్ అమీరుద్దీన్ ఆదివారం తనిఖీ చేశారు. ఆయన రికార్డులను పరిశీలించారు. పాఠకుల నుంచి సభ్యత్వం, వారి సంఖ్యను పెంచాలని ఆయన లైబ్రేరియన్ శివశంకర్‌ను ఆదేశించారు.

పుల్లీడు వద్ద ఆటో బోల్తా : పలువురికి గాయాలు

పోరుమామిళ్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుల్లీడు వద్ద ఆటో బోల్తా పడడంతో పలువురికి గాయాలయ్యాయి. ఆదివారం మైదుకూరు టౌన్ వినాయకనగర్ కు చెందిన వారు మద్దిమానుగురప్పస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణం వెళుతుండగా ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ప్రయాణికులకు గాయాలయ్యాయి. కాగా గాయపడిన వారిలో నాగమణి, అపర్ణ, నాగచైతన్య, శేఖర్ తదితరులకు స్వల్పంగా గాయపడ్డారు. వారిని 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అదుపు తప్పి బైకు బోల్తా: ఇద్దరికి గాయాలు

ముద్దనూరు, అక్టోబరు20 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి పులివెందుల రోడ్డులోని నాలుగు రోడ్ల సమీపంలో ఆదివారం రాత్రి బైకు బోల్తా పడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన పాములేటి, తొండూరు మండలం పోతలపల్లె గ్రామానికి చెందిన శివ బైకుపై పోతలపల్లెకు బైకుపై వెళుతుండగా నాలుగు రోడ్ల సమీపంలో గుంతను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మినీ వ్యాను ఢీకొనడంతో ఒకరికి గాయాలు

పోరుమామిళ్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల మండలంలోని వసుంధర కళ్యాణ మండపం సమీపంలో పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన డేరంగుల దేశాయి అనే వ్యక్తి మాచర్ల నుంచి తాడిపత్రికి ఎర్రమట్టి తీసుకుని పోతూ లారీకి గాలి పడుతుండగా మినీ వ్యాను నడిపే డ్రైవరు వాహనం అదుపు తప్పి దేశాయిని ఢీకొంది. ఈ సంఘటనలో అతనికి కాలికి గాయం కాగా 108 వాహనం ద్వారా పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్సఅనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

జీపు ఢీ కొని వ్యక్తికి తీవ్రగాయాలు

మైదుకూరు రూరల్ అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగరం వద్ద నంద్యాల నుంచి మైదుకూరు వైపు వస్తున్న బొలెరో పికప్ జీపు,తోపుడు బండిలో రోడ్డుపై కూరగాయల వ్యాపారం చేస్తున్న మునెయ్యను ఢీకొంది. మునెయ్యకు తీవ్రగాయాలుకాగా 108 వాహనంలో చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం తమిళ కూలీల బ్యాగులు స్వాధీనం

అట్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అట్లూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని అయ్యప్ప గుడి పడమటి భాగాన ఫారెస్టులో ఎర్రచందనం తమిళ కూలీల బ్యాగులు ఆదివారం సాయంత్రం ఫారెస్టు రేంజర్ కళావతి స్వాధీనం చేసుకున్నారు. బ్యాగులపైన తమిళ అక్షరాలతో ఉన్నందున వాటిని పరిశీలించగా, వారి దుస్తులు, తాగునీరు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎర్రచందనం స్మగ్లర్లు అనే అనుమానంగా గుర్తించి వారి ఆచూకీ గాలింపు చర్యల చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక అట్లూరు పోలీసులు ఎర్రచందనం దొంగలైన తమిళ బ్యాగులను చూసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

రూ.12 లక్షలతో భూమిపూజ

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని చెముళ్లవారిపల్లె పంచాయతీలో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. పల్లెపండుగ వారోత్సవాల సందర్భంగా ఆదివారం మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి సోములవారిపల్లె పరిధిలోని ఈశ్వర్‌రెడ్డినగర్‌లో ఉన్న రెండో వార్డులో ఈ భూమిపూజ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.ప్రశాంతి, పీఆర్‌డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం పోరు మామిళ్లలోని ఏపీటీఎఫ్ రీజనల్ కార్యా లయంలో జరిగిన సమావేశంలో మాట్లాడు తూ ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు బలోపేతం చేయాలంటే 117 జీవో రద్దు చేయాలన్నారు. స్టేట్ కౌన్సిలరు భాస్కర్‌రెడ్డి, గురయ్య, ఎస్‌ఏ సత్తార్, శ్రీనివసరెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సిబ్బంది కొరత తీర్చాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 50 పడకల ఆసుపత్రిలోవైద్యసిబ్బంది కొరత తీర్చాలని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, పట్టణసహాయ కార్యదర్శి కేశవ అన్నారు. ఆదివారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో 12 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం నలుగురు మాత్రమే ఉన్నారన్నారు. పోరుమామిళ్ల ప్రధాన కేంద్రం కావడంతో కలసపాడు, కాశినాయన బి.కోడూరు నుంచి అధిక సంఖ్యలో వైద్యం కోసం వస్తుంటారన్నారు.

విద్యార్థిని మృతి దారుణం

బద్వేలు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన విద్యార్థిని బద్వేలుకే చెందిన విఘ్నేష్ నిప్పంటించి హత్య చేయడం దారుణమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి తెలిపారు. ఆదివారం మృతు రాలి తల్లిదండ్రులను ఆమె పరామర్శించారు. విద్యార్థిని మానవమృగం చేతిలో మరణించిందన్నారు. అలాగే న్యాయస్థానాలు సైతం ఇలాంటి వారి విషయంలో చట్టాలు కఠిన తరం చేసి తీర్పులు త్వరితగతిన వెలువడేలా పనిచేయాల్సి ఉందన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాను రాజ్యమే బలికొంది

సీపీఐ, సీపీఎం ప్రజా సంఘాలు



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాలు

ప్రొద్దుటూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాయిబాబాను రాజ్యమే కర్కశంగా బలికొందని ప్రముఖ న్యాయవాది దాదాహయాత్ అభిప్రాయ పడ్డారు. ఆదివారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను స్థానిక నందిని కాంప్లెక్స్‌లోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ చట్టం న్యాయవ్యవస్థ ఆయనను పదేళ్ళ పాటు జైల్లో వేసినా 90 శాతం వికలాంగుడైన సాయిబాబా ఓడించలేక పోయిందన్నారు. కవయిత్రి రామాయణం రాజేశ్వరి మాట్లాడుతూ సాయిబాబా, వరవరరావు లాంటి మేధావులు, రచయితలపై ఎంత క్రూరమైన నిర్బంధం ప్రయోగించినా వారు ఈ సమాజపు వేగు చుక్కలన్నారు. సీపీఐ కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఊపాలాంటి నిరంకుశచట్టాలు, ఎన్‌ఐఏ లాంటి సంస్థలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి సత్యం , పీకేఎస్ అధ్యక్షుడు శ్రీనిసులరెడ్డి , చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ , పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు లెక్చరర్ సురేష్, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు భారతి ,సమతా సంఘం అధ్యక్షురాలు ఉషారాణి, మాలమహానాడు కన్వీనర్ మురళి ,జమాతే ఇస్లాం ప్రతినిధి షఫీ, పీటీఎల్‌ఏ ప్రతినిధి శ్రీను తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం శివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

ప్రజలను చైతన్యపరచడంలో కవులు, రచయితలది కీలకపాత్ర



విపంచిక కందకావ్యం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలను చైతన్యపరచడంలో కవులు, రచయితలు కీలకపాత్ర పోషిస్తారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెంగల వీరాంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం గీతాశ్రమంలో పెరుగు భవానీశంకర్ రచించిన విపంచిక కందకావ్యాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజు దేశాన్ని పాలించినట్లే కవులు, రచయితలు మనుషులను పాలిస్తారన్నారు. రచయిత భవానీశంకర్ దేశభక్తితో ఈ కావ్యాన్ని రచించారని పేర్కొన్నారు. పాశ్చాత్య వ్యామోహంతో యువత నిర్వీర్యమవుతోందన్నారు. రచయిత భవానీశంకర్ మాట్లాడుతూ భారతీయత అద్భుతమైన సైన్స్ అని, దీని గురించి వివరించడం అంటే వజ్రాలను వదిలి గాజులకొలను ఏరుకోవడమేనన్నారు. ఈ కార్యక్రమంలో కవి, డాక్టర్ బుర్రి సుబ్బరాయుడు, కాలువ చలపతి, వీహెచ్‌పీ నాయకులు మల్లికార్జునరావు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

ఉచితంగా గుండె, కంటి వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : గుండెజబ్బుపట్ల అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలకే ప్రమాదమని ప్రముఖ గుండెవ్యాధి నిపుణుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నెహ్రూరోడ్డులో ఉచితంగా గుండె,కంటి వైద్య శిబిరం డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ హరిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా మూడో ఆదివారం ఉచితంగా ఈ వైద్య శిబిరాన్ని నడుపుతున్నామన్నారు. 46 మంది గుండె జబ్బురోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. 24 మందికి ఉచితంగా ఈసీజీ తీసినట్లు తెలిపారు. 10 గుండెస్కానింగ్ సైతం చేసినట్లు పేర్కొన్నారు, 36 మందికి కంటి వైద్య పరీక్షలు, మందులను ఉచితంగా అందజేసినట్లు వారు తెలిపారు.

'కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు'

బద్వేలు, అక్టోబరు 20,(ఆంధ్రజ్యోతి): కూటమిపాలనలో మహిళలకు రక్షణ కరువై ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు.బద్వేలులో ఓ యువకుడి చేతిలో గాయపడిన విద్యార్థిని మృతి చెంద డం అత్యంత బాధాకరమన్నారు. ప్రేమ పేరుతో మైనర్ బాలికకు నిప్పంటించడంతో తీవ్రంగా గాయపడిన బాలిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూయడం అత్యంత బాధాకర మన్నా రు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి,వైసీపీ నేతలు రమణారెడ్డి, సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు చూడతరమా..?



కంకర తేలిన మూడిండ్లపల్లె రహదారి

దువ్వూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : దువ్వూరు మండలం మూడిండ్లపల్లె, పెద్దభాకరాపురం మీదుగా వెళ్లే ఆర్అండ్ బి రోడ్డు అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాల ధాటికి ప్రజలు దారి వెంట నడిచేందుకు చాలా ఇబ్బంది రామ్ సాయి నగర్ నుంచి మూడిండపల్లె చిన్నభాకరాపురం మీదుగా రెండు కిలోమీటర్ల మేరకు తారురోడ్డు నిర్మించారు. వర్షాలతో దారి అధ్వానంగా మారడటంతో పాదచారులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. మూడిండ్లపల్లెతో పాటు చిన్న భాకరాపురం వరకు రోడ్డు నిర్మించారు. నిత్యం ప్రజలు ఏదోక పని మీద దువ్వూరుతో పాటు ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ నేపధ్యంలో ఇబ్బందులు పడకుండా రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

